బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 25 జులై 2024 www.balagamtv.com పేజీలు 4

# ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుభవార్త చెప్పారు. శాసనమండలిలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగ వ్యవస్థ అంతా కూడా మనకోసం, ఈ రాష్ట్ర ప్రజల కోసం పనిచేస్తోందని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యో గులకు చేయాల్సినవన్నీ చేయాల్సిందేనన్నారు. ప్రస్తుతం ఉన్న ఆర్థిక క్లిష్ట పరిస్థితుల్లో కొంత సమయం తీసుకోవాల్సి వస్తోందని వెల్లడించారు. ధనిక రాష్ట్రంగా ఉన్నప్పుడే డీఏ ఇవ్వడానికి రెండు నుంచి ఏడేళ్ల పాటు సమయం తీసుకున్నారు. ఇప్పుడు అంత సమయం తీసుకోకుండా ఆ డీఏలు ఇచ్చే ఏర్పాటు చేస్తాం. త్వరలోనే శుభవార్త వింటారన్నారు. అయితే ఇదే సమయంలో ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు.



# బడ్జెట్‌పై ఇండియా కూటమి నిరసన

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

వివక్షపూరిత బడ్జెట్‌పై ఇండియా బ్లాక్ నేతలు నిరసనకు దిగారు. కేంద్ర ఆర్థికమంత్రి మంగళవారం లోక్‌సభలో 2024-25 బడ్జెట్ వివక్షపూరితంగా ఉందని ఇండియా బ్లాక్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బడ్జెట్‌కు వ్యతిరేకంగా బుధవారం ఉదయం పార్లమెంట్ వద్ద నిరసన తెలిపారు. 'ప్రతిపక్ష వ్యతిరేక కుర్సీ బచావో బడ్జెట్ ముర్దా బాద్' అంటూ ప్రతిపక్షనేతలు నినాదాలు చేశారు. ఈ నిరసనల్లో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపి సోనియాగాంధీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, టీఎంసి ఎంపి డోలా సేన్‌లు పాల్గొన్నారు.

కాగా, మోడీ నేతృత్వంలోని ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ మోసపూరిత బడ్జెట్ అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే అన్నారు. ఈ బడ్జెట్‌కు వ్యతిరేకంగా పార్లమెంటులోనూ నిరసన తెలుపుతాం అని ఆయన పేర్కొన్నారు.

**రాజ్యసభలోనూ...**




బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ రాజ్యసభలోనూ ఇండియా బ్లాక్ నేతలు ఆందోళన చేపట్టారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై వివక్ష చూపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలను బడ్జెట్ 'బ్లాక్ అవుట్ ' చేసిందని కాంగ్రెస్ మండిపడింది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో బీజేపీ యేతర రాష్ట్రాల ప్రస్తావన కూడా చేయలేదని ధ్వజమెత్తింది.

# 'కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం' తీర్మానానికి ఆమోదం

- తెలంగాణకు న్యాయం జరిగేలా బడ్జెట్ లో సవరణలు చేయాలని విజ్ఞప్తి
- తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి
- ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన బీఆర్ఎస్ పార్టీ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణ పట్ల ప్రదర్శించిన వివక్షను నిరసిస్తూ శాసనసభ తీర్మానం ఆమోదించింది. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. కేంద్ర బడ్జెట్ లో అవసరమైన మేరకు సవరణలు చేయాలని శాసనసభ కోరింది.

'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం' అనే అంశంపై బుధవారం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టింది. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ఈ తీర్మానాన్ని అసెంబ్లీ ముందు పెట్టారు. అన్ని పార్టీలు ఈ తీర్మానంపై తమ అభిప్రాయాలను తెలిపాయి. బీఆర్ఎస్ పార్టీ ఈ తీర్మానానికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కేవలం బీజేపీ మాత్రమే ఈ తీర్మానాన్ని వ్యతిరేకించింది. తీర్మానానికి వ్యతిరేకంగా బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. కాగా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని, తెలంగాణపట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిందని తీర్మానంలో పేర్కొన్నారు. అంతేగాక బడ్జెట్‌ను సవరించి తెలంగాణకు నిధులు ఇవ్వాలని ఈ తీర్మానం ద్వారా శాసనసభ కోరింది. అనంతరం సభను రేపటికి వాయిదా వేశారు.

**అసెంబ్లీ ఆమోదించిన తీర్మానం**

"డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం భారతదేశం అన్ని రాష్ట్రాల సమాఖ్య. అన్ని రాష్ట్రాల సమీకృత సమ్మిళిత అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం బాధ్యత. ఈ ఫెడరల్ స్ఫూర్తిని కేంద్ర ప్రభుత్వం విస్మరించింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణకు వివక్ష జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇదే ధోరణి కొనసాగించింది.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల సుస్థిర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి. కానీ విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను అమలు చేయటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. పార్లమెంటులో చేసిన విభజన చట్టంలో పొందుపరిచిన హామీలు ఇప్పటికీ అమలు కాకపోవటం తెలంగాణ ప్రగతిపై తీవ్రమైన ప్రభావం చూపింది.

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి, మరియు రాష్ట్ర మంత్రులు పలు దఫాలుగా ప్రధాన మంత్రిని, ఇతర కేంద్ర మంత్రులను కలిసి వివిధ విజ్ఞప్తులు చేశారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులకు ఆర్థిక సాయం కోరటంతో పాటు చట్ట ప్రకారం రావాల్సిన నిధులు, అపరిష్కృతంగా ఉన్న అంశాలపై అనేక సార్లు అభ్యర్థనలు అందించారు.

కానీ కేంద్ర ప్రభుత్వం వీటిని పట్టించుకోకుండా కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ పట్ల పూర్తిగా వివక్ష చూపించింది. అందుకే తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర అనుసరించిన తీరుపై ఈ సభ తీవ్ర అసంతృప్తిని, నిరసనను తెలియజేస్తోంది.

ప్రస్తుతం కొనసాగుతున్న బడ్జెట్ చర్చల్లోనే కేంద్ర బడ్జెట్ కు సవరణలు చేసి తెలంగాణ రాష్ట్రానికి న్యాయం జరిగేటట్లు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ ఈ సభ తీర్మానం చేస్తుంది."

# రాష్ట్రంలో మరో రెండు రోజులు వర్షాలు..



- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో గత నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు.. మరికొన్ని జిల్లాల్లో ముసురు కురుస్తోంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. జలాశయాలు నిండు కుండగా మారాయి. మరో రెండ్రోజులు పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజాగా హెచ్చరించింది. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని చెప్పారు.

బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు ఆసిఫాబాద్, మంచిర్యాల,జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్-భూపాలపల్లి, హనుమకొండ, ములుగు, కామారెడ్డి,సంగారెడ్డి, రాజన్న-సిరిసిల్ల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30- 40 కి.మీ వేగంతో కూడిన ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్,నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, జనగామ,కామారెడ్డి జిల్లాలలో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీచేశారు.

భారీ ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని..జాగ్రత్తగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు సూచించారు. పిడుగులు కూడా పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరం అయితేనే బయటకు వెళ్లాలని.. చెట్ల కిందకు వెళ్లరాదని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో జూన్ 1 నుంచి బుధవారం వరకు రాష్ట్రంలో 238.9 మి.మీ వర్షపాతం నమోదైంది. జూలై సాధారణ వర్షపాతం 229.1 మి.మి ఉండగా, ఇప్పటి వరకు 238.9 మి.మీ వర్షపాతం నమోదైంది. గడిచిన 24 గంటల్లో కొమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో అత్యధికంగా 10.02 సెం.మీ, కౌతాలలో 8.44 సెం.మీ, చింతలమానెపల్లి 8.37 సెం.మీ, సిర్పూర్-టీలో 7.64 సెం.మీ, పెంచికల్‌పేట 6.14 సెం.మీ,దహేగాన్‌లో 4.66 సెం.మీ, ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్ అర్బన్‌లో 6.46 సెం.మీ, బేలలో 4.57 సెం.మీ, ఇంద్రవెల్లిలో 4.56 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది.

# శ్రీశైలంకు పెరిగిన వరద ప్రవాహం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఎగువ నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం భారీగా పెరుగుతూ వస్తోంది. బుధవారం సాయంత్రం రిజర్వాయర్‌లోకి 1,75,448క్యూస్కెల వరద నీరు చేరుతుండగా, ప్రాజెక్టులో నీటినిలువ 80టిఎంసీలకు పెరిగింది. ఉదయం 846అడుగుల వద్ద ఉన్న నీటిమట్టం సాయంత్రానికే 850 అడుగులకు చేరుకుంది. ఎగువన మహారాష్ట్ర ,కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో ఆల్మట్టి ప్రాజెక్టులోకి 1.78లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా, ప్రాజెక్టు నుంచి 2లక్షల క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ డ్యాం నుంచి 2.02లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి జూరాలకు 1.65లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా, ప్రాజెక్టు నుంచి 1.50లక్షల క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. మరో వైపు తుంగభద్ర ప్రాజెక్టుకూ కూడా భారీగా వదర ప్రవాహం వస్తోంది. ఎగువ నుంచి 86633 క్యూసెక్కుల నీరు చేరుతుండగా ప్రాజెక్టు నుంచి 18746క్యూసెక్కులు బయటకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిలువ సామర్థం 105టిఎంసీలు కాగా, బుధవారం సాయంత్రానికి 100టిఎంసీలకు చేరుకుంది.

**ప్రాణహితకు తగ్గిన వరద**

గోదావరికి ప్రధాన ఉపనదిగా ఉన్న ప్రాణహితకు వరద స్వల్పంగా తగ్గింది. బుధవారం ప్రాణహిత నుంచి మేడిగడ్డ బ్యారేజికి 7.84లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండగా ,వచ్చిన నీటిని వచ్చినట్టుగా

# రేవంత్‌రెడ్డి X కేటీఆర్





- అసెంబ్లీలో మాటల యుద్ధం
- కేసీఆర్ సభకు ఎందుకు రాలేదు : సీఎం రేవంత్‌రెడ్డి
- మాకు జవాబు చెప్పండి చాలు : ఎమ్మెల్యే కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తెలంగాణ శాసనసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. అవగాహనా రాహిత్యంతో కేటీఆర్ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని రేవంత్ అన్నారు. కీలకమైన చర్చ జరుగుతున్నప్పుడు కేసీఆర్ ఎందుకు రాలేదని సీఎం ప్రశ్నించారు 'మాకు జవాబు చెప్పండి చాలు. మీకు కేసీఆర్ అవసరం లేదు' అని కేటీఆర్ వ్యాఖ్యానించడంతో సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ "తండ్రి పేరు చెప్పుకొని నేను మంత్రిని కాలేదు. కింది స్థాయి నుంచి ఎదిగి ముఖ్యమంత్రిని అయ్యా. కేటీఆర్‌ది మేనేజ్‌మెంట్ కోటా అనుకున్నా. అంతకంటే దారుణం" అని అన్నారు. ఆ వెంటనే కేటీఆర్ స్పందిస్తూ 'రేవంత్ పేమెంట్ కోటాలో సీఎం అయ్యారని మేమూ అనొచ్చు' అని వ్యాఖ్యానించారు. దానికి రేవంత్ కౌంటర్ ఇస్తూ 'పేమెంట్ కోటాలో సీఎంను కాలేదు. మొన్న బీఆర్ఎస్ నేతలు ఢిల్లీ వెళ్లి చీకట్లో మాట్లాడుకొని వచ్చారు' అని వ్యాఖ్యానించారు. కేటీఆర్ స్పందిస్తూ "మేనేజ్‌మెంట్ కోటాలో మంత్రి అయ్యానని సీఎం అనొచ్చా? సభా నాయకుడు అలా మాట్లాడొచ్చా?" అని ప్రశ్నించారు. అనంతరం కేటీఆర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చర్చను సమర్థిస్తున్నట్లు తెలిపారు

రాష్ట్రానికి నిధుల కోసం ఢిల్లీలో దీక్ష చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు చేసిన డిమాండ్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం దేశరాజధానిలోని జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ వస్తే, పాలకపక్షనేతగా తాను వస్తానని రేవంత్ చెప్పారు. రాష్ట్రానికి నిధుల కోసమైనా కేసీఆర్ ముందుకురావాలని కోరారు.

మీరే తారీఖు డిసైడ్ చేయండి దీక్షకు మేం సిద్ధమంటూ సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రానికి నిధులు తెచ్చుడో, సచ్చుడో తేల్చుకుందామని సవాల్ విసిరారు. చావు నోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చామని మేమెప్పుడూ పదే పదే చెప్పలేదన్నారు. రూ.100 పెట్టి పెట్రోల్ కొన్నారు కానీ, అగ్గిపెట్టి కొనలేదన్నారు అగ్గిపెట్టి మర్చిపోయినట్టు నటించి అమాయక విద్యార్థులను బలిగొనలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. పరస్పర విమర్శలతో సభ వేడెక్కింది.

"మేమెప్పుడూ చావు నోట్లో తల పెట్టామని పదే పదే చెప్పలేదు. మేము అగ్గిపెట్టె మర్చిపోయి అమాయక విద్యార్థులను బలిగొనలేదు. ప్రతిపక్ష నాయకుడుగా కేసీఆర్‌ను రమ్మనండి. ముఖ్యమంత్రిగా నేనూ వస్తా, ఇద్దరం జంతర్ మంతర్ వద్ద ఆమరణ దీక్షకు కూర్చుందాం. తెలంగాణకు నిధులు తెచ్చుడో, సచ్చుడో తేల్చుకుందాం. మీరు తారీఖు డిసైడ్ చేయండి, జంతర్ మంతర్‌లో దీక్షకు మేం సిద్ధం."- రేవంత్?రెడ్డి, ముఖ్యమంత్రి

తెలంగాణ పట్ల కేంద్రం వైఖరి ఎలా ఉందో ప్రజలకు తెలియాలి : 'కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం ' తీర్మానంపై మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిని కేంద్రం కాపాడాలని కోరారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం దశాబ్దాల పాటు సమాఖ్య స్ఫూర్తిని కాపాడిందని, అన్ని రాష్ట్రాల్లో భారీ సాగునీటి ప్రాజెక్టులను నిర్మించిందని తెలిపారు.

భాక్రానంగల్, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిందని తెలిపారు. ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్‌ను ప్రధానిగా చేసి దేశాన్ని పరిపుష్ఠం చేసిందని, భారత్ ఆర్థికంగా నిలదొక్కుకుందని తెలిపారు. ఎన్నో పోరాటాలు చేసి రాష్ట్ర ప్రజలు తెలంగాణ సాధించుకున్నారన్న ముఖ్యమంత్రి, తెలంగాణ అభివృద్ధి కోసం పునర్విభజన చట్టంలో ఎన్నో అంశాలు పెట్టారని గుర్తుచేశారు.

# రైల్వే కేటాయింపులు ఇవే ..

- తెలంగాణలో రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధికి రూ.5336 కోట్ల నిధులుకేటాయింపు
- వివరాలు వెల్లడించిన రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో రైల్వే ప్రాజెక్టుల అభవవృద్ధికి కేంద్రం పెద్దపీత వేసిందని , అందుకు గాను 2024-25 రైల్వే బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రంలో పలు రైల్వే అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ. 5336 కోట్ల నిధులుకేటాయింపు జరిగిందని రైల్వేలు, సమాచార- ప్రసార , ఎలక్ట్రానిక్స్ , ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. అలాగే ఏపీ రాష్ట్రంలో సైతం రైల్వే అభివృద్ధి కోసం రూ.9151 కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారు. రైలేవ్లకు సంబందించిన కేటాయింపులతో కూడిన కేంద్ర బడ్జెట్‌ను 23 జూలై 2024న పార్లమెంట్‌లో సమర్పించారు. ఈ సందర్భంగా రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలంగాణ,ఏపీ రాష్ట్రాలకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపుల ముఖ్యాంశాలపై ఢిల్లీ నుండి వర్చువల్ ప్రెస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైల్వేలను ప్రపంచ స్థాయికి చేర్చడంపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి వెల్లడించారు. 2024-25 సంవత్సరానికి గాను భారతీయ రైల్వేలకు రూ.2,62,000 కోట్లు కేటాయించారని తెలిపారు.అలాగే రైల్వేలో భద్రతకు సంబంధిత కార్యకలాపాలకు అధిక మొత్తంలో రూ.1.9 లక్షల కోట్లు కేటాయించారని తెలిపారు. ఇదే క్రమంలో తెలంగాణ రాష్ట్రానికి ఈ సారి కూడా భారీ మొత్తంలో రూ.5,336 కోట్లు కేటాయించారని తెలియజేశారు. 2009-నుంచి 2014 మధ్య కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వార్షిక సగటు బడ్జెట్ వ్యయం రూ. 886 కోట్లు. 2009-14 మధ్య కాలంలో జరిగిన సగటు కేటాయింపుల కంటే ప్రస్తుత సంవత్సరం కేటాయింపులు దాదాపు ఆరు రెట్లు ఎక్కువగా ఉండటంతో తెలంగాణకు బడ్జెట్ కేటాయింపులు నిరంతరాయంగా పెరుగుతున్నాయని ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులు, కొత్త ట్రాక్ పనుల మొత్తం వ్యయం రూ . 32,946 కోట్లు కాగా తెలంగాణలో రైల్వే నెట్‌వర్క్ 100శాతం విద్యుదీకరించబడిందని అన్నారు. 2009-2014 లో కేవలం 17 కిలోమీటర్ల ట్రాక్ వేయగా గత పదేళ్లలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సగటున సంవత్సరానికి 65 కిలోమీటర్ల మేర నూతన ట్రాక్ వేశామని చెప్పారు . గత పదేళ్లలో 437 ఆర్ఓ బి లు , ఆర్ యూ బి లు నిర్మించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని 40 రైల్వే స్టేషన్‌లను అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద పునరాభివృద్ధి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఇదే క్రమంలో ఏపీ లో రూ.73,743 కోట్ల మిగితా 4వ పేజీలో

# నేడు తెలంగాణ బడ్జెట్

- ప్రవేశపెట్టనున్న మల్లు భట్టి విక్రమార్క
- ఫిబ్రవరిలో రూ.2,75,891 కోట్ల అంచనాలతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్
- నేడు పూర్తి స్థాయి బడ్జెట్

వివరాలు 4వ పేజీలో

# చంద్రుడిపై నీటి ఆనవాళ్లు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



చంద్రుడి నుంచి భూమికి చాంగే 5 సాయంతో మట్టిని తీసుకువచ్చిన చైనా ఆ ఆనవాళ్లలో నీటి జాడ ఉన్నట్టు కనుగొన గలిగింది. ఈ ఆనవాళ్లపై గత నాలుగేళ్లుగా పరిశోధనలు చేస్తున్నారు. 2020లో చైనా చాంగే 5 ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టింది. చంద్రుడి నుంచి 2 కిలోల మట్టి, రాళ్లను తీసుకు వచ్చింది. అప్పటి నుంచి సాగించిన పరిశోధనల్లో ఆ నమూనాల్లో నీటి అణువులు ఉన్నట్టు తేలింది. ఈ మేరకు పరిశోధన పత్రాన్ని ఓ జర్నల్‌లో ప్రచురించినట్టు పేర్కొంది. అమెరికా, రష్యా వ్యోమగాములు కూడా 40 ఏళ్ల క్రితమే చంద్రుడి నుంచి నమూనాలను సేకరించి తీసుకు వచ్చారు. 2009 లో భారత్ ప్రయోగించిన చంద్రయాన్ 1 వ్యోమనౌక చంద్రుడిపై నీటి జాడ ఉన్నట్టు కనుగొనడం గమనార్హం.

# 'డబుల్' ఇండ్లు ఎన్ని నిర్మించారు



- డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష

బలగం టీవీ ,సిరిసిల్ల

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం జిల్లా సమీకృత కార్యాల యాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఆయా మండలాల వారీగా చేపట్టిన నిర్మాణాలు ఎన్ని, ఎన్ని పూర్తయ్యాయి అయ్యాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాభాయ్, పంచాయతీ రాజ్ ఈఈ భూమేశ్, ఆర్ అండ్ బీ డీఈఈ నాగరాజు, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఈఈ అనిత సింగనాథ్, హౌసింగ్ శాఖ డీఈ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నేతలు అబద్ధాలు మానుకొని

# అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వండి...

- పార్క్ నిర్మాణం విషయంలో బీఆర్ఎస్ నేతల మాటలు హాస్యాస్పదం
- ముమ్మాటికీ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతోనే పార్క్ నిర్మాణము త్వరగా పూర్తయింది
- కాంగ్రెస్ పార్టీ నాయకులు




బలగం టివి, వేములవాడ:

వేములవాడ పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో రెండు కోట్ల రూపాయలతో నూతనంగా పార్కును నిర్మించారు. అయితే పార్కు నిర్మాణం విషయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులతో పాటు నాయకుల పాత్ర ఏమీ లేదని, పార్కు నిర్మించిన ఘనత పూర్తిగా బి.ఆర్.ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులకు,జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకే దక్కుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ చేసిన వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు.. బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ ఆధ్వర్యంలో, పట్టణ కౌన్సిలర్లు,కాంగ్రెస్ నాయకులు, పార్క్ ను సందర్శించి, అభివృద్ధి జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ చైర్పర్సన్ వ్యాఖ్యలను ఖండించారు. పార్కు నిర్మాణం కేవలం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతోనే పూర్తయిందని, భూమి కేటాయింపు విషయంలో వివాదం తలెత్తితే అధికారులతో మాట్లాడి దాన్ని పరిష్కరించడమే కాకుండా త్వరగా పార్కు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకున్న గొప్ప నాయకుడు ఆది శ్రీనివాస్ అని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి బి.ఆర్.ఎస్ పార్టీ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి పనులను కొలువుదీరిన కొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని, ఈ క్రమంలోనే ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో ఇప్పటికే రూ.20కోట్లు వి.టి.ఏ.డి.ఏ ద్వారా రాజన్న ఆలయ అభివృద్ధికి మంజూరయ్యాయని, కానీ పదేళ్లు సీఎం గా ఉన్నా కేసీఆర్ ఏటా వందకోట్ల రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చి, 600 కోట్ల రూపాయలు ఇవ్వాల్సింది పోయి ఆరు రూపాయలు కూడా ఇవ్వలేదని ఎద్దేవాచేశారు. ఇప్పటికైనా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు తమపై, తమ నాయకులపై విమర్శలు చేయడం మానుకొని, నిజాలను నిర్భయంగా ఒప్పుకుంటూ,అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అన్నారం ఉమారాణి- శ్రీనివాస్, ఇప్పపూల అజయ్, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, సాగరం వెంకటస్వామి, నాయకులు పాత సత్యలక్ష్మి, కనికరపు రాకేష్, నామాల లక్ష్మీరాజం, వంగల శ్రీనివాస్, పుల్కం రాజు,గూడూరి మధు, పీర్ మహమ్మద్, వస్తాదు కృష్ణ, ముంజ ఉమేందర్ గౌడ్, గంటల ప్రకాష్, తోట రాజు, ఇన్నారం సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# మెసాలకు పాల్పడుతున్న గల్ఫ్ ఏజెంట్ అరెస్టు

- నకిలీ గల్ఫ్ ఏజెంట్లు తీరు మార్చుకోకపోతే ఉపేక్షించేది లేదు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



బలగం టివి ,వేములవాడ:

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మనాల అడ్డబోర్ తండా గ్రామానికి చెందిన అజ్మీరా కిషన్ అనే వ్యక్తి తన ఇద్దరి స్నేహితులతో ఆర్మేనియం దేశంలో లక్షల్లో జీతాలతో ఉపాధి,ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని,అమాయక ప్రజలకు వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసి గల్ఫ్ దేశాలకు పంపకుండా మోసాలకు పాల్పడుతున్నా అజ్మీరా కిషన్‌ను అరెస్ట్ చేసినట్టు జిల్లా ఎస్పీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... అజ్మీరా కిషన్ అనే వ్యక్తి మానాల కు చెందిన కోల కృష్ణం రాజు అనే వ్యక్తి ని ఉపాధి నిమిత్తం అర్మేనియా అక్కడి నుండి రష్యా దేశానికి పంపిస్తా అని నెలకు లక్ష జీతం వస్తుంది అని మాయమాటలు చెప్పి అర్మేనియా దేశానికి పంపించడానికి 4,50,000/- రూపాయలు ఖర్చు అవుతుందని అవి కట్టిన నెల రోజుల లోపు అర్మేనియా దేశానికి పంపిస్తా చెప్పగా, అదేవిధంగా పెగ్గెర్ల కి చెందిన తేలు రంజిత్ అనే వ్యక్తి వద్ద 7,50,00/-, మెట్పల్లి కి చెందిన గరిపెల్లి శశిధర్ వద్ద 6,50,000/- నరేష్ అంబారిపేట వద్ద 4,70,000/- ఆత్మకూరు కి చెందిన పుప్పాల సందీప్ వద్ద 7,50,000/- ముత్రిమాడు కి చెందిన అమరకొండా అనిల్ వద్ద 4,30,000/- మల్లేష్ వద్ద 4,50,000/- , మెట్పల్లి కి.చెందిన గుంటుగా రాజేష్ వద్ద 2,50,000/- తీసుకొని వారికి విసిట్ విజాలు ఇచ్చి ఆర్మేనియం దేశం పంపి అక్కడ మూడు నెలలు ఉంచుకొని ఎలాంటి పని చూపించకుండా ,అక్కడ ఎలాంటి వసతులు కల్పించకుండా అజ్మీర కిషన్, సేపూరి తిరుపతి , కాల్వ ఉమా మహేష్ అను ముగ్గురు వ్యక్తులు మోసాలకు పాల్పడగా కోల కృష్ణం రాజు పిర్యాదు మేరకు రుద్రంగి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి అజ్మీర కిషన్ అరెస్ట్ చేయడం జరిగిందని, మిగతా ఇద్దరిని త్వరలో పట్టుకోవడం జరుగుతుందని తెలిపారు.రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల జిల్లాలో అజ్మీరా కిషన్, సేపూరి తిరుపతి , కాల్వ ఉమా మహేష్ చేతిలో మోసపోయిన బాధితులు 60 కి పైగా ఉన్నారని వారు మీ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్లలో పిర్యాదు చేయాలని తెలిపారు.

ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్ళేవారు నకిలీ ఏజెంట్లకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని, ఇమ్మిగ్రేషన్, చట్టబద్ధత ఉన్నవారు నుంచి వీసాలు పొందాలన్నారు.ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించి గల్ఫ్ మోసాలకు పాల్పడుతున్న వారు తమ వైఖరి మార్చుకోకపోతే కఠిన చర్యలు చేపడుతం అని హెచ్చరించారు.గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ గల ఏజెంట్ల వివరాలు తెలుసుకొనుటకు జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ 8712656411 లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ వారిని సంప్రదించవచ్చని సూచించారు.

# గేమ్ ఇప్పుడే స్టార్ట్ అయింది



- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గేమ్ ఇప్పుడే స్టార్ట్ అయిందని.. ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ మంత్రి జైలు పోయే లిస్టులో మొదటి వ్యక్తి అని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, మల్లారెడ్డి, ప్రశాంత్ రెడ్డిల మధ్య ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. ఆయన మాట్లాడుతూ తాము ఎమ్మెల్యేలను కొనలేమని, కేసీఆర్ మాత్రం రూ.20, రూ. 30 కోట్లు ఇచ్చి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొన్నారని మండిపడ్డారు. తాము బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రూ.5, 10కి మాత్రమే అడుగుతున్నామని, అందుకే ఇంకా 26 ఎమ్మెల్యేలు తమ దగ్గరికి రాలేదన్నారు. రూ.300 కోట్లు ఖర్చు పెట్టి మునుగోడు ఉపఎన్నికలో గెలిచారని.. కర్ణుడిని ఓడించినట్లు ఓడించారని ఆయన అన్నారు. మునుగోడు ఉపఎన్నిక ఫలితం బీఆర్ఎస్‌పై పడడం కారణంగానే కేసీఆర్ అధికారం కోల్పోయారన్నారు. తాను మంత్రి పదవి కోసం పైరవీలు చేయనని.. అయ్యేది ఉంటే ముఖ్యమంత్రి కావొచ్చని అన్నారు.

TS DEECET

## డీ సెట్ ఫలితాలు వెల్లడి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రి స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కాలేజీలలో సీట్ల భర్తీ కోసం ఈ నెల 10న నిర్వహించిన (ఆన్‌లైన్)డీఈఈసెట్-2024 పరీక్ష ఫలితాలను సెట్ కన్వీనర్ బుధవారం విడుదల చేశారు. ఈ ఫలితాలు జులై 25వ తేదీ నుంచి సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండనున్నాయిఈ ఫలితాలలో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలో కలిపి మొత్తం 71.53 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. ఇందులో తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియంలో నిర్వహించిన డీఈఈసెట్ కోసం మొత్తం 17,595 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 15,150 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 12,032 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు అధికారులు తెలిపారు. మొత్తం పరీక్షలు రాసిన వారిలో తెలుగు మీడియంలో 6,644 మంది, ఇంగ్లీష్‌లో 5,024 మంది, ఉర్దూలో 364 మంది విద్యార్థులు ఉన్నారు.

డీఈఈసెట్ ఫలితాలకు సంబంధించిన మార్కులు/ ర్యాంకు కార్డులు https://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో జులై 25వ తేదీ నుంచి అందుబాటులో ఉంటాయని కన్వీనర్ పేర్కొన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ, వెబ్ ఆప్షన్ల నమోదు, సీట్లు కేటాయింపు వంటి తేదీలు త్వరలో విడుదల చేస్తామని తెలిపారు.

# ఘనంగా బోనాల పండుగ..



బలగం టివి, సిరిసిల్ల

ఆషాఢ మాసం సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని కూరగాయల మార్కెట్ లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకొని డప్పువాయిద్యాల మధ్య ఊరేగించారు. పోచమ్మ తల్లికి మరియు మైసమ్మ తల్లికి బోనాలు, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ పూర్ణచందర్ మాట్లాడుతూ అమ్మ వార్ల దయ వలన వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండేలా, రైతులకు కాలం కలిసి వచ్చేలా ఉండాలని, అలాగే సిరిసిల్ల పట్టణంలో వస్త్ర పరిశ్రమలో నెలకొన్నటువంటి ఇబ్బందులు తొలిగిపోవాలని అలాగే ప్రజలందరూ బాగుండాలని అమ్మవార్లను కోరుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్ కూరగాయల మార్కెట్ కమిటీ అధ్యక్షులు లక్కిరెడ్డి రాజిరెడ్డి, కూరపాటి శ్రీశైలం , గుర్రాల నర్సింలు , బత్తుల భూమేష్ , సార్ల గాలయ్య , తడుక రమేష్ , శ్రీనివాస్ , ఆడెపు జగన్ , దుర్గవ్వ కూరగాయల మార్కెట్ వ్యాపారులు పాల్గొన్నారు.

# గిరిజన బిడ్డకు ప్రభుత్వం అండ..

- ఉన్నత విద్యాభ్యాసానికి తొలగిన అడ్డంకులు..

బలగం టివి, సిరిసిల్ల

ఐఐటీ పాట్నాలో సీటు సాధించిన పేద విద్యార్థినికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. తన చదువు పూర్తి అయ్యే దాకా ఆర్థిక సహాయం అందించాలని సీఎంఓ ఆదేశాలు జారీ చేసింది. దీంతో గిరిజన బిడ్డకు ఉన్నత విద్యాభ్యాసానికి అడ్డంకులు తొలగిపోయాయి.రాజన్న సిరిసిల్ల వీర్నపల్లి మండలం గోనే నాయక్ తండాకు చెందిన బదావత్ రాములు - సరోజ దంపతులకు ముగ్గురు కూతుర్లు. ఇద్దరు డిగ్రీ పూర్తి చేసి, వ్యవసాయ పనుల్లో సహాయ పడుతున్నారు. మూడో కూతురు మధులత ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్ లో ప్రతిభ చూపి ఎస్టీ కేటగిరిలో 824వ ర్యాంక్ రా వడంతో పాట్నా ఐఐటీ లో సీట్ వచ్చింది, అయితే రూ. 3 లక్షల ఫీజు చెల్లించలేని స్థితిలో ఉంది. మధులత ఆర్థిక ఇబ్బందులను మీడియా, వివిధ మాధ్యమాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సీఎంఓ దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఆ విద్యార్థినిని హైదరాబాద్ పిలిపించుకొని,విద్యార్థినిని అభినందించారు. మధులత చదువు పూర్తి చేసేందుకు కావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందించాలని ఆదేశించారు. దీంతో గిరిజన సంక్షేమ శాఖ నుంచి నిధులు అందించనున్నారు. ఆమె సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తదితరులకు మధులత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



# రాజన్న సిరిసిల్లలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు..

- రాజన్నకు ప్రత్యేక పూజలు

నిర్వహించిన బీఆర్ఎస్ శ్రేణులు

బలగం టివి, సిరిసిల్ల

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రివర్యులు, సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు 48వ జన్మదిన వేడుకలను రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా బిఆర్ఎస్ శ్రేణులు బుధవారం ఘనంగా నిర్వహించారు.వేములవాడ లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామికి కోడె మొక్కు చెల్లించుకొని అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, వారి నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీని మరింత ముందుకు తీసుకుపోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్పర్సన్ కళా చక్రపాణి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీలు, జడ్పిటిసిలు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిరిసిల్ల రూరల్ సీఐను కలిసిన ఓయూ జేఏసీ చైర్మెన్ కొత్తపల్లి తిరుపతి

బలగం టివి, సిరిసిల్ల

సిరిసిల్ల రూరల్ సీఐ గా బాధ్యతలు చేపట్టిన మొగిలి ని ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ చైర్మెన్ కొత్తపల్లి తిరుపతి బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరిం చారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడంలో తెలంగాణ పోలీసులు ఎప్పుడు ముందు వరుసలో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాను, శ్రీనివాస్, రాజు, సంతోష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# భద్రాచలం వద్ద శాంతించిన గోదావరి



- ధవళేశ్వరం వద్ద కొనసాగతున్న 2వ ప్రమాద హెచ్చరిక
- ముంపులోనే లంక గ్రామాలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఉగ్రరూపం దాల్చిన గోదావరి మంగళవరం రాత్రి నుంచి శాంతించింది. భద్రాచలం వద్ద క్రమంగా తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం భద్రాచలం వద్ద 45.30 అడుగుల నీటిమట్టం నమోదైంది. దీంతో అక్కడ రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద బుధవారం నాటికి 14.70 అడుగుల నీటి మట్టం నమోదైంది. ఇక్కడ ఇంకా రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. కాటన్ బ్యారేజీ నుంచి 175 గేట్లను పైకి లేపి 14,18,752 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. వ్యవసాయ అవసరాల నిమిత్తం తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాల్వలకు 3,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి విడుదలవుతున్న వరదతో లంకలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లోని కాజ్‌వేలపై నడుంలోతు నీరు ప్రవహిస్తుంది. ఆలమూరు మండలం తోకలంక, బడుగువాని లంక, అయినవిల్లి మండలంలో పల్లపులంక, అయినవిల్లిలంక, శానిపల్లిలంక, పొట్టిలంక, పి.గన్నవరంలోని గంటిపెదపూడి లంకల్లో లోతట్టు ప్రాంతాల్లో ఇంకా వరద నీరు నిలిచే ఉంది. రామచంద్రపురం మండలం కోటిపల్లి రేవు పూర్తిగా నీటమునిగింది. కపిలేశ్వరపురం మండలంలోని నారాయణ లంక, కేదార్లంక, తాతపూడి, కోరుమిల్లి, అద్దంకివారి లంకల్లోకి వరదనీరు ప్రవేశించింది. రాజమహేంద్రవరంలో నిర్వాసితుల పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. సుమారు 600 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాల్లో గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది. ఆచంట మండలంలోని అయోధ్య లంక, పుచ్చలంక, భీమలాపురం, శివారు కాపులపాలెంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పుచ్చలంకలో గోదావరి నదిని ఆనుకొని ఉన్న ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది. దీంతో అధికారులు లంక గ్రామాల్లో రెండు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. యలమంచిలి మండలంలోని పలు గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. కనకాయ లంక కాజ్‌వేపై 12 అడుగుల మేర వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నరసాపురం పట్టణ శివార్లలో పొన్నపల్లి శ్మశాన పూర్తిగా వాటిక మునిగింది.

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు వద్ద శబరి నది నీటి మట్టం 38 అడుగులకు తగ్గింది. ఎటపాక మండలం మురుమూరు గ్రామానికి గత మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. విఆర్.పురం మండలంలో శబరి, గోదావరి సంగమంలో వరద స్వల్పంగా తగ్గుతుంది. శ్రీరామగిరి, వడ్డి గూడెంతోపాటు పలు గ్రామాల్లో ముంపు తగ్గకపోవడంతో బాధితులు పునరావాస కేంద్రాల్లోనే ఉన్నారు. విఆర్.పురం, కూనవరం మండలంలోని ముంపు గ్రామాల ప్రజలకు అధికారులు నిత్యావసర సరుకులు అందజేశారు. ఎడతెరిపి లేని వర్షాలకు మారేడుమిల్లి-రంపచోడవరం ప్రధాన రహదారిపై, జీకే వీధి మండలం గుమ్మిరేవుల %-% వర్తండపాడు ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు నేలకూలాయి. దీంతో ఈ రెండు ప్రాంతాల్లోనూ భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.



# ఏ రాష్ట్రాన్నీ విస్మరించలేదు

- బడ్జెట్ ప్రసంగంలో అన్ని రాష్ట్రాల పేర్లను చెప్పలేము
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

2024 బడ్జెట్ వివక్షపూరితంగా ఉందని, విపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాలపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిందని విమర్శలు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. బుధవారం రాజ్యసభలో ప్రసంగించిన ఆమె... బడ్జెట్‌లో ఏ రాష్ట్రాన్నీ విస్మరించలేదని ( స్పష్టం చేశారు. బడ్జెట్ ప్రసంగంలోనే అన్ని రాష్ట్రాల పేర్లను చెప్పలేమంటూ గట్టి కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగానే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం ప్రవేశపెట్టే ప్రతీ బడ్జెట్‌లో దేశంలోని అన్ని రాష్ట్రాల పేర్లనూ ప్రస్తావించే అవకాశం రాదు. నేను చాలా రాష్ట్రాల పేర్లు చెప్పలేదని.. కేవలం రెండు రాష్ట్రాల గురించి మాట్లాడానని మల్లికార్జున ఖర్గే గారు అన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీ చాలా కాలం అధికారంలో ఉంది. వాళ్లు చాలా భిన్నమైన బడ్జెట్‌లను సమర్పించారు. ప్రతి బడ్జెట్ ప్రసంగంలోనూ దేశంలోని అన్ని రాష్ట్రాల పేర్లు ప్రస్తావించే అవకాశం మీకు లభించదని స్పష్టంగా తెలుసు' అని అన్నారు.

బడ్జెట్ ప్రసంగంలో ఒక నిర్దిష్ట రాష్ట్రం పేరును ప్రస్తావించని మాత్రానా.. ఆ రాష్ట్రానికి కేంద్రం నిధులు వెళ్లవా..? అని ప్రశ్నించారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. మహారాష్ట్రలోని వందవన్‌లో అతి పెద్ద ఓడరేవును ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. కానీ తన బడ్జెట్ ప్రసంగంలో మహారాష్ట్ర పేరును ప్రస్తావించలేదన్నారు. బడ్జెట్ ప్రసంగంలో మహారాష్ట్ర పేరు చెప్పనందుకు ఆ రాష్ట్రాన్ని విస్మరించినట్లా?.. అలా అని ఆ రాష్ట్రం తమను కేంద్ర విస్మరించిందని భావిస్తోందా..? అని ప్రశ్నించారు. ఆ ప్రాజెక్టుకు రూ.76 వేల కోట్లు ప్రకటించినట్లు ఈ సందర్భంగా నిర్మలమ్మ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలు చేస్తున్నాయని దుయ్యబట్టారు.

## భద్రాచలంలో తగ్గిన వరద ఉధృతి



- రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. మంగళవారం ఉదయం 51.6 అడుగుల వరకు చేరిన గోదావరి నీటిమట్టం మధ్యాహ్నం నుంచి క్రమంగా తగ్గుతూ వస్తోంది. బుధవారం ఉదయానికి 47.3 అడుగులకు నీటిమట్టం చేరింది. మంగళవారం ఉదయం నుంచి ఇప్పటివరకు సుమారు ఐదు అడుగుల నీటిమట్టం తగ్గినట్టు అధికారులు తెలిపారు. గోదావరి నీటిమట్టం తగ్గడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. అయితే ఇంకా మొదటి ప్రమాద హెచ్చరిక అమల్లోనే ఉంది. నీటిమట్టం నిలిచి ఉండటం వల్ల భద్రాచలం వద్ద స్నాన ఘట్టాల ప్రాంతం వరద నీటిలో మునిగి ఉంది.నీటిమట్టం తగ్గడంతో భద్రాచలం నుంచి దుమ్ముగూడెం చర్ల వెళ్లే ప్రధాన రహదారిపై చేరిన వరద నీరు తగ్గి.. భద్రాచలం నుంచి దుమ్ముగూడెం చర్ల మండలాలకు రాకపోకలు సాగుతున్నాయి. ఇంకా నీటిమట్టం తగ్గితే భద్రాచలం నుంచి విలీన మండలాలకు వెళ్లే రహదారులు కూడా వరద నీటి నుంచి తేరుకుని రాకపోకలు సాగనున్నట్లు అధికారులు తెలిపారు.

## సింగరేణిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేటీకరించేది లేదు

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



సింగరేణిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేటీకరించేది లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ వంశీకృష్ణ సింగరేణిని కాపాడాలని, ప్రయివేటీకరించవద్దని లోక్ సభలో కోరారు. ఈ అంశంపై కిషన్ రెడ్డి స్పందిస్తూ సింగరేణి రాష్ట్ర ప్రభుత్వం అధీనంలో ఉందన్నారు. సింగరేణిని ప్రయివేటీకరించేది లేదని తమ లక్ష్యంలో కూడా అది లేదన్నారు. సింగరేణికి పదేళ్ల నుంచి ఎలాంటి మైనింగ్ ఇవ్వలేదని, కానీ ఒడిశాలో తమ బీజేపీ ప్రభుత్వం రాగానే మైనింగ్ కోసం అనుమతులు మంజూరు చేశామని గుర్తు చేశారు. సింగరేణిపై నరేంద్రమోడీ ప్రభుత్వానికి కమిట్‌మెంట్ ఉందన్నారు.

## క్షీణించిన లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్యం



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్యం మంగళవారం క్షీణించింది. దీంతో ఆయనను ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఆయనకు చికిత్స కొనసాగుతోంది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఆయన ఆరోగ్యం ఇబ్బందికరంగా ఉండడంతో సోమవారమే ఆయన బీహార్ రాజధాని పాట్నా నుంచి ఢిల్లీకి వెళ్లారు. కాగా దాణా కుంభకోణం కేసుల్లో దోషిగా తేలిన ఆయన ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు.

కాగా, లాలూ ప్రసాద్ యాదవ్ గత కొంత కాలంగా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయం తెలిసిందే. లాలూ కొన్నేళ్లుగా కిడ్నీ, గుండె సంబంధిత సమస్యలతో సతమతమవుతున్నారు. 2022 నవంబర్‌లో ఆయనకు సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ కూడా జరిగింది. ఆయన కుమార్తె రోహిణి.. లాలూకి కిడ్నీ దానం చేశారు. ఆ తర్వాత కొంత కాలానికి తిరిగి భారత్ వచ్చారు. అనారోగ్యం నుంచి కోలుకున్న లాలూ రాజకీయాల్లో మళ్లీ యాక్టివ్ అయ్యారు. ఇంతలోనే ఆరోగ్యం తిరగబెట్టినట్లు తెలుస్తోంది

## ఆర్టీసీ కార్మికులపై బీఆర్ఎస్ మొసలి కన్నీళ్లు



- మంత్రి పొన్నం ప్రభాకర్
- మాజీ మంత్రి హరీశ్‌రావుకు కౌంటర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆర్టీసీ కార్మికులపై బీఆర్ఎస్ మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ.. "ఆర్టీసీ కార్మికుల సంక్షేమంపై కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చింది.. ఆర్టీసీ కార్మికులను పీఆర్సీ పరిధిలోకి తెస్తామన్నారు. ఆర్టీసీ విలీనంపై ఎప్పటిలోగా అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటిస్తారు. కార్మికుల యూనియన్ పునరుద్ధరణ ఎప్పుడు చేస్తారు? అని ప్రశ్నించారు.

హరీశ్ రావు ప్రశ్నకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం ఇస్తూ.. బీఆర్ఎస్ పై నిప్పులు చెరిగారు. యూనియన్లు రద్దు చేసి ఇప్పుడు పునరుద్ధరణ గురించి హరీశ్ రావు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆర్టీసీ కార్మికులు 50 రోజులు సమ్మె చేసినా గతంలో పట్టించుకోలేదని.. ఆర్టీసీ సొమ్మును గత ప్రభుత్వం వాడుకుందని ఆరోపించారు. ఆర్టీసీకి తాము రూ.300 కోట్లు ఇస్తున్నామని తెలిపారు. ఆర్టీసీకి కొత్త బస్సులు కొంటున్నామని.. ఆర్టీసీలో 3,035 మంది ఉద్యోగులను నియమిస్తున్నామని మంత్రి పొన్నం చెప్పారు.



## నీట మునిగిన సంగమేశ్వర ఆలయం

**బలగం టీవీ, కొల్లాపూర్**

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల గ్రామం వద్ద ఉన్న కృష్ణానదికి జూరాల ప్రాజెక్టు 33 గేట్లు తెరవడంతో నది సమీపంలో ఉన్న సంగమేశ్వర ఆలయం నీట మునిగింది. 842 అడుగులకు పైగా వరద జలాలు శ్రీశైలం ప్రాజెక్టు వైపు పరుగులు పెడుతున్నాయి. గత సంవత్సర కంటే ఈ సంవత్సరం ముందుగానే వరద రావడంతో మత్స్యకారులు, రైతులు సంతోష పడుతున్నారు. కృష్ణానది నిండుగా ప్రవహిస్తునడంతో సోమశిల పుణ్యక్షేత్రం వద్ద భక్తుల తాకిడి పెరిగింది.

## రాంగ్‌రూట్‌లో వెళ్లి ఆర్టీసీ బస్సును ఢీకొన్ని బైక్

- ఇద్దరు మృతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆర్టీసీ బస్సు, బైకును ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. చందానగర్ టీజీఎస్‌ఆర్టీసీ ఓ బైకును బుధవారం ఉదయం ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మదీనాగుడ జీఎస్‌ఎం మాల్ నుంచి చందానగర్‌కు బైక్‌పై , చందానగర్‌కు చెందిన మనోజ్, రాజులు వెళుతున్నారు. చందానగర్ జీఎస్‌ఎం మాల్ సమీపంలో యుటర్న్ దగ్గర రాంగ్ రూట్‌లో వెళుతూ.. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టారు. బైక్ నడుపుతున్న మనోజ్‌తో పాటు వెనకాల కూర్చున్న రాజు కూడా అక్కడిక్కడే చనిపోయాడు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని.. పోస్టుమార్టం నిమ్మితం మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## 1.5 టీఎంసిల కెపాసిటీతో గంధమల్ల ప్రాజెక్టు

- మంత్రి ఉత్తమ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



1.5 టీఎంసీల నీరు నిలిపేలా గంధమల్ల ప్రాజెక్టును నిర్మిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. గంధమల్లపై ఇప్పటివరకు రూపాయి పని కూడా జరగలేదని.. భూసేకరణపై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా శాసన మండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. గంధమల్ల రిజర్వాయర్ అంశం సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందని.. రిజర్వాయర్ పూర్తయితే ఆలేరు ప్రాంతానికి లాభం జరుగుతుందన్నారు. ఈ బడ్జెట్‌లో గంధమల్ల రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని మల్లన్న కోరారు.ఈ సందర్భంగా మాట్లాడిన మంత్ర ఉత్తమ్.. గంధమల్ల గ్రామస్థులు ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. స్థానికులు భూసేకరణకు సహకరిస్తే ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని చెప్పారు. 4.28 టీఎంసీల కెపాసిటీ కావాలంటే గంధమల్ల మునిగిపోతుందన్నారు.

## నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం



- టేకాఫ్ అవుతున్న సమయంలో కూలిన విమానం
- 18 మంది మృతి

**బలగం టీవీ, ఖాఠ్‌మాండూ**

నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. ఖాఠ్‌మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉదయం 11 గంటలకు శౌర్య ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో అదుపుతప్పి కూలిపోయింది. ఈ ఘటనలో 18 మంది మృతి చెందారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియలో వైరలయ్యాయి.

19 మంది సిబ్బందితో పొఖార్‌కు బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన క్షణాల్లోనే కూలిపోయింది. ఆ వెంటనే పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో విమానం దగ్ధమైంది. మరోవైపు ఈ దుర్ఘటనలో 18 మంది మృతి చెందగా.. పైలట్ 37 ఏళ్ల మనీశ్ షక్య ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న రెస్క్యూ టీమ్ వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న పైలట్‌ను వెంటనే చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఛ..



## హాస్టల్‌లో యువతి గొంతు కోసి...

- దారుణ హత్య
- బెంగళూరులో ఘటన

**బలగం టీవీ, బెంగళూరు**

ఓ దుండగుడు అర్థరాత్రి లేడీస్ హాస్టల్లో చొరబడి ఓ యువతి గొంతు కోసి హతమార్చిన ఘటన బెంగళూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని లేడీస్ హాస్టల్‌లోకి అర్థరాత్రి ఓ వ్యక్తి చొరబడ్డాడు. బిహార్‌కు చెందిన కృతి కుమారి(24) అనే యువతి గదిలోకి ప్రవేశించి కత్తితో ఆమె గొంతు కోసి, దారుణంగా హతమార్చాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. బుధవారం ఉదయం యువతి రక్తపు మడుగులో ఉండడాన్ని గమనించిన హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి తరలించారు. హత్యకు గల కారణాలు తెలియలేదని తెలిపారు. నిందితుడిని గుర్తించేందుకు ఆ ప్రాంతంలో ఉన్న అన్ని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

## ట్రంప్‌ను వెనక్కి నెట్టిన కమలా హారిస్



**బలగం టీవీ, వాషింగ్టన్**

అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఈ ఏడాది నవంబర్ 5న జరుగనున్నాయి. రిపబ్లిక్ పార్టీ తరఫున మరోసారి డోనాల్డ్ ట్రంప్ బరిలోకి దిగుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. దీంతో డెమొక్రాట్ అభ్యర్థిగా భారత సంతతికి చెందిన కమలా హారిస్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మార్గం సుగమమైంది. కమలా హారిస్ బరిలో నిలుస్తుండడంతో ఎన్నికల్లో గట్టి పోటీ ఉంటుందని భావిస్తున్నారు. తాజాగా ఓ సర్వే కీలక రిపోర్ట్ విడుదల చేసింది. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ కంటే కమలా హారిస్‌కే విజయ అవకాశాలు ఎక్కువ గా ఉన్నట్లు పేర్కొంది. ఐపీఎస్ఓఎస్ నేషనల్ పోల్స్ ప్రకారం.. ట్రంప్ కంటే కమలా హారిస్ ముందంజలో నిలిచారు. సోమ, మంగళవారాల్లో ఈ పోల్ జరిగింది. ఆదివారం బైడెన్ ఎన్నికల బరిలో నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. జూన్ 27న డోనాల్డ్ ట్రంప్‌తో జరిగిన చర్చల తర్వాత బైడెన్ పోటీ నుంచి తప్పుకోవాలని సొంత పార్టీ నేతల నుంచే డిమాండ్లు వినిపించాయి. తాజాగా నిర్వహించిన సర్వేలో డోనాల్డ్ ట్రంప్‌కు 42శాతం మంది మద్దతు తెలుపగా.. కమలా హారిస్‌కు 44 మందిశాతం అండగా నిలిచారు. దాంతో డెమోక్రటిక్ అభ్యర్థిత్వానికి అవసరమైన మద్దతును కూడగుడుతన్న సమయంలో సర్వేలో ఉపాధ్యక్షురాలికి అనుకూలంగా సర్వే ఫలితం వచ్చింది. ఇంతకు ముందు ఈ నెల 15-16 మధ్య జరిగి సర్వేలో ట్రంప్ 44శాతం.. జులై 1-2 మధ్య జరిగిన సర్వేలో డోనాల్డ్ ఒకశాతం పాయింట్లతో ముందంజలో నిలిచారు.

ప్రస్తుతం కమలా హారిస్ మద్దతు పెరుగుతోందని జాతీయ సర్వేలు చెబుతున్నాయి. పోల్‌స్టర్ టోనీ ఫాబ్రిజియో మాట్లాడుతూ హారిస్ ప్రజాదరణ పెరగడం కొంతకాలం పాటు కొనసాగుతుందని చెప్పారు. ఇటీవల నిర్వహించిన జాతీయ సర్వేల్లో 56శాతం మంది ఓటర్లు కమలా హ్యారిస్ అభ్యర్థిత్వంపై ఆసక్తి చూపించారు. మానసికంగా ధృడంగా ఉండగలరని.. సవాళ్లను ఎదుర్కోగల సామర్థ్యం ఆమెకు ఉందని అమెరికన్లు భావిస్తున్నారు. అయితే, 78 నుంచి 49శాతం మంది ఓటర్లు ట్రంప్‌పై సైతం ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. కేవలం 22శాతం మంది మాత్రమే బిడైన్‌కు ఇదే అభిప్రాయాన్ని ఉందని తెలిపారు.

పీబీఎస్ న్యూస్ సర్వే ప్రకారం.. మొత్తం అమెరికన్లలో 87 శాతం మంది ఎన్నికల రేసు నుంచి తప్పుకోవాలని బిడెన్ తీసుకున్న నిర్ణయం సరైందేనని భావించారు. 41 శాతం మంది బిడెన్ నిర్ణయంతో నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో డెమొక్రాట్‌ల గెలుపు అవకాశాలను పెంచుతుందని అంచనా వేస్తున్నారు. ఇక ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అధ్యక్ష అభ్యర్థిత్వం దాదాపు ఖరారైంది. అధ్యక్ష అభ్యర్థికి కావాల్సిన 1,976 కంటే ఎక్కువగానే ప్రతినిధులు ఆమెకు మద్దతును ప్రకటించారు. ఇటీవల డెలావేర్‌లో ప్రచార ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. బిడైన్ ప్రచార బృందంతో భేటీ అయ్యారు. అదేబృందంతో కలిసి పని చేయనున్నట్లు ప్రకటించారు. ఎన్నికలకు సమయం మూడునెలలే ఉందని.. గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డోనాల్డ్ ట్రంప్‌పై మండిపడ్డారు.

## జియాగూడలో భారీ అగ్నిప్రమాదం..



- పదేండ్ల బాలిక మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ పాతబస్తీలోని జియాగూడలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బాలిక మృతిచెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం అర్థరాత్రి తర్వాత జియాగూడ వెంకటేశ్వరనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఫర్నీచర్ తయారీ ఫ్యాక్టరీలో మంటలు చెలరేగాయి. అవి క్రమంగా బిల్డింగ్ మొత్తానికి వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది పది ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అపార్టుమెంటు మొదటి, రెండో అంతస్తుల్లో ఉన్న 20 మందిని రక్షించారు. వారిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ బాలిక శివప్రియ (10) మృతిచెందింది. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగినట్లు అంచనావేస్తున్నారు.

## బీఆర్ఎస్ తీర్మానం తిరస్కరణ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ వేసి ప్రతిపాదనను స్పీకర్ తిరస్కిరించారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటనతో పాటు ఇతర న్యాయమైన డిమాండ్లు చర్చించాలని కోరుతూ కేటీఆర్ ప్రతిపాదన చేయగా అందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తిరస్కిరించారు. జాబ్ క్యాలెండర్ ప్రకటనతో పాటు నిరుద్యోగులకు సంబంధించి ఇతర న్యాయపరమైన డిమాండ్ల పై అసెంబ్లీలో చర్చించాలని కోరుతూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కి వాయిదా తీర్మాణం ఇచ్చింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కల్వకుంట్ల తారక రామారావు ప్రతిపాదించిన ఈ వాయిదా తీర్మానాన్ని స్పీకర్. రిజెక్ట్ చేశారు. స్పీకర్ వాయిదా తీర్మానాన్ని రిజెక్ట్ చేయడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఆందోళనకు దిగారు.

# నేడు తెలంగాణ బడ్జెట్

- ప్రవేశపెట్టనున్న మల్లు భట్టి విక్రమార్క
- ఫిబ్రవరిలో రూ.2,75,891 కోట్ల అంచనాలతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్
- నేడు పూర్తి స్థాయి బడ్జెట్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ శాసనసభ సమావేశాలు జులై 23న ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ అసెంబ్లీ సమావేశాలు ఆగస్టు 2 వరకు కొనసాగనున్నాయి. గురువారం (జులై 25) డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. శాసనమండలిలో మంత్రి శ్రీధర్ బాబు బడ్జెట్ ప్రవేశపెడతారు. జులై 26వ తేదీ అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. జులై 27న బడ్జెట్ పై చర్చ చేపట్టనున్నారు. జులై 28న ఆదివారం కావడంతో అసెంబ్లీ సమావేశాలు తిరిగి సోమవారం నుంచి కొనసాగనున్నాయి. జులై 29, 30 తేదీల్లో పలు బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. జులై 31న ద్రవ్య



వినిమయ బిల్లును సభలో ప్రవేశపెట్టనున్నారు. అలాగే ఆగస్టు 1, 2 తేదీల్లోనూ రేవంత్ సర్కారు వివిధ బిల్లులు ప్రవేశపెట్టేందుకు కసరత్తులు చేస్తోందని సమాచారం

# రైల్వే కేటాయింపులు ఇవే ..

(మొదటి పేజీ తరువాయి)

నిధులతో చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతు న్నాయని, అందులో భాగంగా 73 రైల్వే స్టేషన్లను సైతం ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఏపీలో గత పదేళ్లకా లంలో 743 ఆర్యూబీ, ఆర్ఓబీలు నిర్మించామన్నారు. అలాగే ఏపీలో రూ.246 కోట్ల వ్యయంతో 56 కిలోమీటర్ల మేర అమరావతి వరకు రైల్వే లైను నిర్మించనున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించి ప్రాజెక్టు అప్రూవల్కు వెళ్లాల్సి ఉందన్నారు.ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అమృత్ స్టేషన్లుగా అభివృద్ధి చేయనున్న 40 స్టేషన్లు.......

ఆదిలాబాద్, బాసర్, బేగంపేట, భద్రాచలం రోడ్, గద్వాల్, హఫీజ్ పేట, హైటెక్ సిటీ, హుప్పుగూడ, హైదరాబాద్, జడ్చర్ల, జనగాం, కాచిగూడ, కామారెడ్డి, కరీంనగర్, కాజీపేట జంక్షన్, ఖమ్మం, లింగంపల్లి, మధిర, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మలక్‌పేట్, మల్కాజ్‌గిరి జంక్షన్, మంచిర్యాల్, మెదక్, మేడ్చల్, మిర్యాలగూడ, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రామగుండం, సికింద్రాబాద్, షాద్‌నగర్, శ్రీ బాల బ్రహ్మేశ్వర జోగులాంబ, తాండూరు, ఉమ్దానగర్, జూకురాబాద్, వికారాబాద్, వరంగల్ , యాదాద్రి , యకుతపురా ,జహీరాబాద్

వర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్సు నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ అరుణ్ కుమార్ జైన్ మరియు ఇతర సీనియర్ రైల్వే కూడా అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు .

# టెస్ట్ ర్యాకింగ్స్ విడుదల

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**




అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) బుధవారం టెస్ట్ ర్యాకింగ్స్ విడుదల చేసింది. ఈ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ 12 రేటింగ్ పాయింట్లు మెరుగుపర్చుకొని, ఆగ్రస్థానంలో ఉన్న కేన్ విలియమ్సన్ (859 రేటింగ్స్?)కు అత్యంత చేరువలోకి వెళ్లాడు. ప్రస్తుతం రూట్ 852 రేటింగ్స్‌తో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇంగ్లాండ్ యంగ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ (771 రేటింగ్స్) నాలుగు స్థానాలు ఎగబాకి, కెరీర్ అత్యుత్తమ ర్యాంక్ 3వ ప్లేస్?కు చేరుకున్నాడు. ఇక టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఒక స్థానం కోల్పోయి 751 రేటింగ్స్‌తో 7వ స్థానంలో ఉన్నాడు. యంగ్ బ్యాటర్ యశస్వీ జైశ్వాల్ (740 రేటింగ్స్) 8వ, విరాట్ కోహ్లీ (737 రేటింగ్స్)తో 10వ స్థానాల్లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం టాప్- 10లో ముగ్గురు టీమ్‌ఇండియా బ్యాటర్లు ఉన్నారు.

ఇక బౌలింగ్ విభాగంలో టీమ్‌ఇండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ టాప్‌లో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం అశ్విన్ 870 రేటింగ్స్‌తో అగ్రస్థానంలో ఉన్నాడు. ఇక ఆసీస్ పేసర్ జోష్ హేజిల్‌వుడ్, టీమ్‌ఇండియా స్టార్ జస్ప్రీత్ బుమ్రా ఇద్దరూ 847రేటింగ్స్‌తో వరుసగా 2,3 స్థానాల్లో ఉన్నారు. రవీంద్ర జడేజా 788 రేటింగ్స్‌తో 7వ ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. కుల్దీప్ యాదవ్ ఒక స్థానం మెరుగుపర్చుకొని 686 రేటింగ్స్‌తో 14వ స్థానంలో ఉన్నాడు.

ఆల్‌రౌండర్ విభాగంలో 444 రేటింగ్స్‌తో జడేజా టాప్ ప్లేస్‌లో కొనసాగుతుండగా, అశ్విన్ (322 రేటింగ్స్) రెండో పొజిషన్‌లో ఉన్నాడు. అక్షర్ పటేల్ (259 రేటింగ్స్) 5వ స్థానంలో కొనసాగు తున్నాడు. ఆల్‌రౌండర్ విభాగంలో టాప్- 5లోనే ముగ్గురు టీమ్‌ఇండియా ప్లేయర్లు ఉన్నారు.

# ఒలింపిక్స్ ఆటలు షురూ..!



- మొదలైన టీమ్ ఈవెంట్స్
- నేడు భారత్ ఆర్చర్లకు తొలి పరీక్ష

**బలగం టీవీ, ప్యారిస్**

క్రీడాభిమానులు అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న విశ్వక్రీడా సంబురాలకు ఎట్టకేలకు తెరలేచింది. పారిస్ వేదికగా జరుగుతున్న 33వ ఒలింపిక్స్ పోటీలలో భాగంగా బుధవారం సాకర్, రగ్బీ సెవెన్స్ మ్యాచ్‌లతో విశ్వక్రీడలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్ సమీపంలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమాల తర్వాత ఒలింపిక్స్ అధికారికంగా ఆరంభమవనుండగా బుధవారం నుంచే టీమ్ ఈవెంట్స్ ప్రారంభమయ్యాయి. స్పెయిన్- ఉజ్బెకిస్థాన్ మధ్య జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్‌తో అంతర్జాతీయ ఆటల పండుగ మొదలైంది. గురువారం ఆర్చరీ, హ్యాండ్‌బాల్ రగ్బీ సెవెన్స్, ఫుట్‌బాల్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆర్చరీలో భాగంగా గురువారం భారత ఆర్చర్లు తొలి పరీక్ష ఎదుర్కోనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమాలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ సిద్ధమయ్యాయి.

ఇటీవలే యూరో కప్ గెలిచిన జోష్‌లో ఉన్న స్పెయిన్ తొలి మ్యాచ్‌తోనే బోణీ కొట్టింది. పశ్చిమ పారిస్‌లో ఉన్న పార్క్‌డెస్ ప్రిన్సెస్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో 2-1తో ఉజ్బెకిస్థాన్‌ను చిత్తు చేసింది. స్పెయిన్ ఫుట్‌బాలర్ మార్క్ పుబిల్ ఆట 29వ నిమిషంలో గోల్ కొట్టి ఒలింపిక్స్‌లో తొలి గోల్ కొట్టిన ప్లేయర్‌గా నిలిచాడు. ఇక సారథి లియోనల్ మెస్సీ లేకుండా ఒలింపిక్స్ ఆడుతున్న అర్జెంటీనా.. మొరాకోతో మ్యాచ్‌ను 2-2తో డ్రా చేసుకుంది. న్యూజిలాండ్ 1-0తో గినియాపై నెగ్గింది. రగ్బీ సెవెన్స్‌లో ఆస్ట్రేలియా, అర్జెంటీనా, ఫిజీ, ఐర్లాండ్ విజయాలు నమోదుచేశాయి.

**భారత ఆర్చర్లకు తొలి పరీక్ష**

ఆటల షెడ్యూల్‌లో భాగంగా భారత ఆర్చర్లకు తొలి పరీక్ష గురువారం ఎదురుకానుంది. మొత్తం ఐదు విభాగాల (పురుషుల, మహిళల వ్యక్తిగత, టీమ్, మిక్స్‌డ్ టీమ్)లో ర్యాంకింగ్ రౌండ్స్ జరుగుతాయి

# చమీర అవుట్...!



**బలగం టీవీ, కొలంబో**

భారత్‌తో మూడు టీ20 మ్యాచ్‌లు ఆడనున్న శ్రీలంకకు సిరీస్ ప్రారంభానికి ముందే భారీ షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ దుష్మంత చమీర గాయం కారణంగా సిరీస్ మొత్తానికి దూరమైనట్టు తెలుస్తోంది. గత ఏడాదికాలంగా గాయాలతో సతమతమవుతున్న చమీర ఇటీవలే ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో రెండు మ్యాచ్‌లు ఆడాడు. భారత్‌తో సిరీస్‌కు కీలకంగా భావిస్తున్న అతడు కాలిగాయంతో తప్పుకోనున్నట్టు శ్రీలంక క్రికెట్ బోర్డు వర్గాల సమాచారం.

చమీర.. గతేడాది వన్డే వరల్డ్ కప్‌లోనూ గాయం కారణంగా టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఒకే ఒక మ్యాచ్ ఆడాడు. లంక పర్యటనలో భారత జట్టు ఈ నెల 27 నుంచి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనున్న విషయం తెలిసిందే. రోహిత్ వారసుడిగా ఎంపికైన సూర్యకుమార్ యాదవ్, రాహుల్ ద్రావిడ్ స్థానాన్ని భర్తీ చేస్తున్న గౌతం గంభీర్‌కు ఇదే తొలి సిరీస్. మరోవైపు లంక జట్టులో కూడా హసరంగ తప్పుకోవడంతో చరిత్ అసలంక ఆ బాధ్యతలను మోయనున్నాడు. దిగ్గజ క్రికెటర్ సనత్ జయసూర్య తాత్కాలిక కోచ్ బాధ్యతలు మోయనున్నాడు.

# 'మిస్టర్ బచ్చన్' నుంచి నేడు రెండో సాంగ్

**బలగం టీవీ, హైదరాబాద్**

మాస్ మహారాజా రవితేజ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న 'మిస్టర్ బచ్చన్' మ్యూజికల్ ప్రమోషన్స్‌లో ఇప్పటికే లాంచ్ చేసిన సితార్ సాంగ్ నెట్టింట మిలియన్లకుపైగా వ్యూస్‌తో అందరినీ ఇంప్రెస్ చేస్తోంది. తాజాగా మరో సాంగ్ సింగిల్ రెప్పల్ డప్పుల్ సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. రవితేజ, భాగ్య శ్రీ బోర్సే మధ్య వచ్చే ఈ పాట ఊరమాస్‌గా సాగుతూ రవితేజ ఎనర్జీ లెవల్స్‌కు ఏ మాత్రం తగ్గకుండా ఉండబోతుందని ప్రోమో చెప్పకనే చెబుతోంది. ఫుల్ లిరికల్ వీడియో సాంగ్‌ను గురువారం సాయంత్రం 5 :04 గంటలకు లాంచ్ చేయనున్నారు. ఈ చిత్రానికి ఇమిక్కీ జే మేయర్ మ్యూజిక్ అందిస్తుండగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ తెరకెక్కిస్తున్నారు. రవితేజ బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్‌బచ్చన్‌కు వీరాభిమాని కాగా.. మాస్ మహారాజా తాజా చిత్రానికి మిస్టర్ బచ్చన్ టైటిల్ పెట్టడంతో సినిమాపై క్యూరియాసిటీ అమాంతం పెరిగిపోతుంది. ఈ చిత్రంలో కథానుగుణంగా రవితేజ బిగ్ బీ అభిమానిగా కనిపించనున్నాడట.

